
# మృగయా

ప్రశాంత



ఆ ఇంటి గదిలోకి అశోకవృక్షాల్ని నిలబెట్టి తీసుకెళ్ళచ్చు. గదుల గోడలు పోతపోసిన మంచుగోడల్లా తెల్లగా వున్నాయి.

ఇంట్లోవున్న ఇరవైఆరు గదుల్లో ఆ ఊళ్ళో జనం అందర్నీ పక్కలేసి వరసగా పడుకోపెట్టచ్చు! ఇంటిబయట తోటలోని ఫ్యాషన్ మొక్కల్ని లాన్స్‌ని పీకేస్తే ఒక చిన్న ఊరికి కావల్సిన పంటలు పండించ వచ్చు.

ఇంట్లో ఎక్కడి వస్తువులు అక్కడ సృష్టిక్రమం అంత అందంగా పేర్చివున్నాయి. ఇంట్లో వాళ్ళ స్థాయిని ఇంటిగేట్లు హుందాగా

★ మృగయా—అంటే వేట. వేటకాడు మానవుడూ వేటాడబడేది మృగమూ అయిఉంటాయి సాధారణంగా. మానవులే మానవుల్ని వేటాడటం కూడా జరుగుతుంది ఒక్కోసారి! ★

చెప్తాయి. ఇంటి యజమాని నాగభూషణం పరపతిని గూర్ఖా మీసాలు చెప్తాయి. అతని ఎర్రటి కళ్లు అందులో క్రూరత్వం నాగ భూషణంలోని క్రూరత్వాన్ని చెప్తాయి.

ఆ ఇంట్లో రోజూ ఎన్నికలంత సందడి. సంత జరుగుతున్నంత గందరగోళం. తమాషా ఏం అంటే ఆ ఇంట్లోనే మళ్ళీ అంత అంద మయిన నిశ్శబ్దం గూడా గంభీరంగా తిరుగు తుంటుంది.

'ఆల్ ఇండియన్స్ ఆర్ మై బ్రదర్స్ అండ్ సిస్టర్స్....'లోనిజం ఎంత వుందో ఆ ఇంట్లోమనిషి మనిషికీ అంతే అనుబంధం. పేరుకు ఒక కప్పుకింద వుంటున్నా ఒకళ్ళతో ఒకరు అవసరం అయితేగానీ మాట్లాడుకోరు. పనిలేనప్పుడు ఒకళ్ళతో ఒకళ్లు అపరిచ యస్థుల్లా వుండటం ఆ ఇంట్లోనే చూడవచ్చు.

నాగభూషణానికి నలుగురు అల్లుళ్ళు నలు గురు కొడుకులు ఇద్దరు భార్యలు కాక ఇంకా బీరకాయపీచు చుట్టాలు చాలామంది ఉన్నారు. అంతా ఆ ఇంట్లోనే వుంటారు. ఇంట్లోని అందరికీ ఒకటే పని—తెల్లారితే సంపాదన. దాన్ని ఏరూపంగా సంపాదిస్తున్నాం అనే ప్రశ్న అసలు వ్యాళకి తెలీదు. స్మగ్లింగ్‌నుంచి బ్రాందీ షాపులదాకా ఆ నగరంలోని అన్ని వ్యాపారాల్లో ఆ ఇంట్లోవాళ్ళ చెయ్యి వుంటుంది.

ఊళ్ళో అందాలు ఐశ్వర్యాలు అక్కడ మస్తరు వేయించుకుంటే తప్ప వాటికి ఉనికి లేదు.

ఆ ఇంటికి నాలుగు దిక్కులున్నాయి. నాలుగు దిక్కుల్లో నాలుగు గేట్లు. నాలుగూ నాలుగు వీధుల్లోంచి లోపలకి దారితీస్తాయి.

ఊళ్లోకి కొత్తగా వచ్చినవాడు నాలుగు వీధుల్లో ఎటువెళ్ళినా నాగభూషణం ఇల్లు చూడక తప్పదు. నాగభూషణం ఇల్లు చూడటం అంటే ప్రముఖ సినీతారని ప్రయివేట్‌గా కల వడం అంత క్రెడిట్.

ఆ ఇంటి కారు షెడ్స్ అన్నీ కలిస్తే లేబర్ కాలనీకి సరిపోతుంది. ఇంటి ముందు ఫౌంటెన్‌లో నీరు ఊరు మొత్తానికి సరి పోతుంది.

నదులన్నీ సముద్రంలో కలుస్తాయి. ఆ నగరంలో సంపదలన్నీ ఫైనల్‌గా అక్కడే చేర్తాయి. ఎందుకంటే చేసేవన్నీ హోల్‌సేల్ వ్యాపారాలు ఫోన్ బిజనెస్‌లూ కాబట్టి. నాగ భూషణం పైకి వచ్చింది బ్రోకరేజింగ్‌లో. ఆయన చెయ్యని బ్రోకరేజింగ్, తెలీనికమీషన్ వ్యాపారంలేవు. ఆకాశంలో నక్షత్రాలన్ని వ్యవ హారాలు ఆయనవి. అల్లుళ్ళు కోడళ్ళు నుంచి మేడలు తోటలు దాకా అన్నీ బ్రోకరేజింగ్‌లో సంపాదించినవే.

నాగభూషణానికి చీకటిపడ్తే వెన్నెల వస్తుందో రాదో అనవసరం. కానీ అతని గదికి ఓ కొత్త ఆడది రావాలి. కొత్త బాటిల్ ఓపెన్ అవాలి.

బాటిల్స్‌ని ఆడవాళ్ళనీ ఓపెన్ చెయ్య డంలో సిద్ధహస్తుడు. పగలు పూట సంస్థల్ని చీకటి పడ్డాక మత్తుల్ని ఆరంభించడం అతని రివాజు.

. అల్లుడు శేషాచలం కొడుకు సింహాచలం నాగభూషణం అలవాట్లకి ప్రతిబింబాలు. ఆ ఇంట్లో అలాంటి ప్రతిబింబాలు ఇంకా చాలా ఉన్నాయి.

ఇంటి మెయిన్ హాల్‌లో గాంధీ నెహ్రూ పటాలు అహింసా సిద్ధాంతాన్ని తాతలనాటి గన్ పులిచర్మాలు హింసనీ చెప్తాయి. లైఫ్ సైజు ఉమర్ ఖయ్యాం పెయింటింగ్ ఆ ఇంటి రస తత్త్వాన్ని అసలు దాహాన్ని చెప్తాయి.

ఆ బంగళా....లేదా ఆ కోటలో సమయం రాత్రి ఎనిమిది అయింది. ఆ ఇంటి గది గది లోనూ ఏదో రంజు పసందు జరుగుతున్నా మొత్తం ఇల్లు మాత్రం బయటికి మహా నిశ్శ బ్దంగా కనిపిస్తుంది.

నాగభూషణం ఫారెస్ట్ డిపార్ట్ మెంట్‌లో పనిచేశాడు. అందుకే అతనికి వేట ఊపిరి. ఆ ఉద్యోగం వదిలేశాక జంతువుల వేట ఆగిపోయి ధనం వేట ఆరంభం అయింది. అది ఉండేది మనుషుల దగ్గర కాబట్టి మను షుల వేట, రక్తంలో జీర్ణించుకు పోయింది.

మాజీ లెక్చెరర్ రత్నావతి నాగభూషణం గదికి వచ్చి గంట అయింది. కావాలని తనని ఇంతసేపు వెయిట్ చేయిస్తున్నాడని ఆమెకి తెలుసు. అయినా నిస్సహాయ.

రత్నావతి కూర్చున్నది ఏ. సి. రూం అయినా ఒళ్ళంతా పొగలు ఆవిర్లుగా ఉంది. రత్నావతికి ఉద్యోగంపోయి నాలుగేళ్లు అయింది. విచిత్ర మయిన పరిస్థితుల్లో ఆమె నాగభూషణం కళ్ళ బడింది. అది జరిగి ఎనిమిదేళ్ళు అయింది. అప్పట్నించి ఈ వేటగాడి బారినుంచి తప్పించు కోడానికి దేశం అంతా పిచ్చిగా తిరిగింది. భూమి గుండ్రమో కాదో తెలీదుగానీ దేశం మాత్రం గుండ్రం అని ఆమెకి బాగా తెలిసిపోయింది. వృత్త కేంద్రంలోని బిందువులా ఆమె ఎటు వెళ్ళినా అతన్నించి తప్పుకోలేకపోయింది. ఇది విధి వైపరీత్యంగాదు, వ్యవస్థ వైపరీత్యం.

'రవి కాంచనిచో కవి కాంచునే గదా' పాత సూక్తి.

'రవి కాంచనిచో రూక కాంచునే గదా' నేటి సూక్తి.

పక్క రూంలో ఆడ మగ నవ్వులు అస్పష్టంగా వినిపిస్తున్నాయి. ఈవేట ఆ గదిలోనూ సాగుతున్నది గాబోలు. అందులో మరో ఆడది మరో వయస్సు మరో ఎత్తులు మరో వెచ్చదనం. అంతే. మొత్తంమీద అసలు ఒకటే. అదే ఆడది. అసలు మీద పెరిగే వడ్డీలాంటివాడు మగాడు.

రత్నావతి గదిలో పెయింటింగ్ సైజులో ఉన్న ఆధునిక గడియారాన్ని చూసింది. మోచెయ్యి పొడుగున కట్ అయిన పన్నెండు ఆకులు పన్నెండు గంటల్ని చూపుతున్నాయి.

గదిలో అర్ధ నగ్న పూర్తి నగ్న చిత్రాలు రేడియో గ్రాంలో నుంచి వస్తున్న సంగీతం పాల సరస్సు అంత విశాలం అయిన పక్క నేలమీద స్పాంజి కార్పెట్ డిమ్ లైటింగ్ చూస్తుంటే రత్నావతికి వికారంగా కసిగా ఉంది.

ఎనిమిదేళ్ళ జీవితంలో ఆమె తన రక్షణ కోసం పరిగెత్తడంలో భర్తని పోగొట్టుకుంది. ఆరోగ్యం ఉద్యోగం హోదా శాంతి చైతన్యం పోగొట్టుకుంది.

భర్త మోహన్ సహజంగా చనిపోయాడని డాక్టర్లు చెప్పినప్పటికీ అతను హత్యచెయ్యబడ్డాడు. ఏం అనుమానంలేదు. ఈ నిజం ఆమెకీ భగవంతుడికీ తప్ప ఎవరికీ తెలీదు.

దేముడు రూప రహితుడు గాబట్టి రూపం ఉన్న మనుష్యులకి కోర్టుకీ సాక్ష్యం చెప్పలేడు. ఆమెకి డబ్బులేదు కాబట్టి ఎవరితోనయినా చెప్పుకొని నాగభూషణాన్ని ఏదన్నా చేసే ప్రసక్తి అసలులేదు. ట్రాన్స్‌ఫర్స్‌మీద ఊరూరా తిరగడంలో ఆమె లివర్ పాడు అయిపోయింది. దాని చికిత్సలో ఉన్న డబ్బు ఉద్యోగం పోయాయి. అనారోగ్యవంతులు ఉండాల్సింది ఆసుపత్రుల్లోగానీ ఉద్యోగాల్లో కాదని ఉన్న ఉద్యోగం కాస్తా పీకేశారు....

నాలుగేళ్ళగా ఈ పరిస్థితులు ఈ ఒంటరి దనం ఈ భయం మధ్య శోభనతో జీవితాన్ని గడిపింది.


ఇన్నాళ్ళుగా తనకి తనే ఒక సమస్య. అది ఇప్పుడు రెండు సమస్యలుగా చీలింది. దాని పేరు శోభన, ఆమె పందొమ్మిదేళ్ళ వయస్సు. చదువుకోవాలని ఆశ తపన ఉన్నప్పటికీ శోభన తన కూతురు అయిన పాపానికి బి. ఏ. మధ్యలోనే ఆపెయ్యాల్సి వచ్చింది.

ఏడాదిగా ఉద్యోగం కోసం అడ్డమయిన ప్రతి వెధవనీ అర్థించడం అర్థంలేని సమాధానాలు తీసుకోడం.

శోభన కనీసం ఆడపిల్ల కాకపోతే, ఆడపిల్ల అయినా ఇంత అందగత్తె కాకపోతే ఈ రోజు ఈ వేటగాడి కోటలోకి తనకి తనుగా అడుగు పెట్టేదికాదు.

రేడియో గ్రాంలో జండా ఉంచా రహే హమారా వినిపిస్తున్నది. ఇవాళ స్వతంత్ర దినం గాబోలు. కొంతమంది లైసెన్స్‌డ్ మర్డర్లు చెయ్యడానికి రెండుకాళ్ళ ఆడ జీవాల్ని వేటాడటానికి అధికార ముద్ర లభించిన రోజు గాబోలు ఇది.

గదిలో గుప్పుని కొట్టిన ఇంపోర్టెడ్ సెంటు వాసనకి రత్నావతి తలెత్తి చూసింది. ఆకలితో కసిలో కైపెక్కిపోయి కోరికతో ఊగి




పోతున్న మృగంలాంటి నల్లటి లావుపాటి నాగభూషణం కనిపించాడు.

నాగభూషణం దగ్గరి డబ్బు తీసేస్తే అతను ఎందుకూ పనికిరాడు. నాగభూషణం ఒంట్లో తెల్లటి పళ్ళు తీసేస్తే ఆకారం అంతా నల్లటి చీకటి ముద్దగా తప్ప ఇంకేం కనిపించదు.

కార్పెట్ మీద ఉన్న రత్నావతి కాళ్ళు జివ్వుమన్నాయి అతని అడుగులు కార్పెట్ మీద నడిచి వస్తుంటే.

కోనేరు అంత విశాలం అయిన హాలులో నల్ల కలువలా మెరుస్తున్న నాగభూషణం సగర్వంగా గొంతు సర్దుకున్న శబ్దం.

'ఎంత సేపు అయింది వచ్చి?'

'మీరు పక్క గదిలోకి వెళ్ళే ముందు'

'ఎవరికో ఉద్యోగం కావాలట. అప్లికేషన్; కాదని పొమ్మంటే వినరు.' నాగభూషణం పరోక్షంగా వేసిన చురకకి ఆమె ఒళ్ళంతా కాలింది.

సోఫామీద కూర్చుని టీపాయ్‌మీద బాటిల్ మూత ఓపెన్ చేస్తున్నాడు. ఎన్ని సంవత్సరాలక్రితం ఏ దేశంలో ఆ ద్రావకం ఈ సీసాలో బిగించబడిందో అది నేటికి అతని పాలు అవుతున్నది. తనకీ ఆ బాటిల్‌కి చాలా సాపత్యం ఉన్నట్లు అనిపించింది.

"మీలాంటి గౌరవనీయులకి ఇలాంటివి.... నచ్చవని నేనే పుచ్చుకుంటున్నా, క్షమించాలి' రత్నావతి ఒంటిమీద రెండో చురక పడింది, ఇది కొరడా దెబ్బ కాదు పిడుగుపాటు. పర పురుష సంపర్కం అసహ్యం అని ఆనాడు మొహంమీద చెప్పి తనే ఇవాళ అతని దగరకి వచ్చిందని మొహంమీద ఎంత తెలివిగా చెప్తున్నాడా అని కుమిలి పోయింది.

రెండో రౌండ్ నింపాడు. మంచు ముక్కలు రెండు వేశాడు. గ్లాసులో మందు బుసలు కొడుతున్న కోరికలా ఉంది. మందు మధ్యలో తేలుతున్న మంచు గడ్డలు కోరికల్లో తేలున్న వయస్సులా ఉంది.

'రత్నావతిగారికి ఇన్నాళ్ళకి మామీద దయ కలిగింది....' నాగభూషణం చెయ్యి ఆమె జాకెట్టు పై భాగంలో మెడకింద తగుల్తున్నది. ఆకలి భరించే స్థాయి దాటిపోతే కలిగే వికారం లాంటి వికారం రత్నావతి గుండెల్ని పిండేస్తున్నది.

'అమ్మాయికి ఉద్యోగం కావాలా?......

చలపతి చెప్పాడు. వాడికి నువ్వు ఏడాది ఇంటి అద్దెగూడా చెల్లించాలన్నాడు. ఫర్వాలేదులే,

రత్న ఎక్కడికీ పారిపోదు. లేకపోతే కాస్త దొరక్కుండా జారిపోతూ ఉంటుంది అన్నా. అంతే నంటావా?' అప్పటికే రత్నావతి జాకెట్టు అతని చేతిలో ఖాళీ చిప్స్ పాకెట్‌లా నలిగి కింద పడిపోయింది.

రత్నావతి పచ్చటి ఒంటి ఒంపులమీద పౌడర్ జల్లుతున్నట్లు డిమ్‌లైటింగ్ గొడ్తున్నది.

అనుభవజ్ఞుడు అయిన వేటగాడు తేను చంపిన జీవం చర్మాన్ని ఎంత నేర్పుగా ఒలుస్తాడో అంత నేర్పుగా గుడ్డలు ఒలుస్తున్నాడు.

జీవాన్ని ఒలిస్తే మాంసం వస్తుంది. ఆడదాని గుడ్డల్ని ఒలిస్తే సృష్టి సౌందర్యాల్లోని పరమాద్భుతాలు వెలికి వస్తాయి. ప్రపంచంలో అత్యధిక హింస ఆడదాని కోసం, ఐశ్వర్యం కోసమే జరుగుతాయి.

కొన్నివేల అడుగుల లోతయిన గదిలోంచి వచ్చే వేడి సెగలాంటి సెగ నాగభూషణం ఒంట్లోంచివచ్చి రత్నావతి ఒళ్ళంతా చుట్టేస్తున్నది.

ఆమె మెత్తదనాల మధ్య అతనూ అతని పొగరు, మొరటుదనం, రసికత్వం ఆవేశం పరిగెడుతుంటే అది అనుభవమో బలాత్కారమో గూడా రత్నావతికి అర్థం గావడంలేదు.

గది వాతావరణం వేడెక్కింది. గదిలోని మనిషి వేడి చల్లబడింది.

ఒక వ్యక్తి ఆత్మగౌరవం కోల్పోతే మరొకరి అహం ఆకాశం అంత ఎత్తున పొంగింది.

రత్నావతి మెల్లిగా లోకపు మర్యాదల్ని కట్టుకుంది.

'ఈ లెటర్ తీసుకెళ్ళి రేపు ఖాన్‌ని కలవమని అమ్మాయికి చెప్పు. అన్నట్లు చలపతికి నువ్వు ఇయ్యాల్సిన అద్దెతో ఇంకో సంవత్సరం ఎడ్వాన్స్‌గూడా యిచ్చా. ఇంక నీకేం భయంలేదు. ..' నాగభూషణం రత్నావతికి చిన్న కాగితం ఇచ్చి ఖాళీ సీసా బయటపడేసి ఇంకోటి అందుకోడానికి ఫ్రిజ్ దగ్గరికివెళ్ళాడు.

రత్నావతి బయటికివచ్చి రిక్షా ఎక్కుతుంటే గూర్ఖా ఓ నవ్వు నవ్వి విష్‌చేశాడు. వాడు రోజూ అలాంటి నవ్వులు ఎన్ని నవ్వుతాడో! నాగభూషణం అనుభవాల చిత్తాకి వాడు చిత్రగుప్తుడు గాబోలు.

తొమ్మిది దాటుతున్నది. బజారు పల్చబడుతున్నది. దారిలో రిక్షా ఆపి సోడా తాగాక రత్నావతికి రిలీఫ్ అనిపించింది.


రోజుచూసే రోడ్లు వీధులు షాపులు కొత్తగా కనబడ్తున్నాయి. రేపట్నించి తనకి ఇంక చాలా సమస్యలు ఉండవు. ఇంటివాడు అద్దెకోసం వచ్చి నానా మాటలు అనడు. నిన్నటిదాకా నడివీధిలో నలుగురి మధ్యా నానా మాటల్తో నగ్నంగా నిలబెట్టి పరువు తీసినంత పనిచేసేవాడు. బట్టలవాడు కిరాణావాడు వాడువీడు. .. ఛ! భగవాన్ ఒక్క జీవితంమీద ఆర్థిక నిస్సహాయత ఎందరికి అధికారం ఇస్తుంది.

—ఒక రకంగా నాగభూషణమే మంచివాడేమో! ఇందరి నుంచి ఎదురయ్యే సమస్యల్ని పావు గంటలో ఎవరూ చూడని గదిలో నగ్నంగా అనుభవించేసి తీర్చేశాడు.

శోభనకి ఉద్యోగం వచ్చాక మెల్లిగా పెళ్ళి అయిపోతే తన జీవితానికి ఇంక సమస్యలు ఉండవు. మనిషి జీవితానికి ఇదే అర్థం. ఈపని చెయ్యడానికి రెండేళ్ళుగా తాత్సారం చేసింది.

నాగభూషణాన్ని తను వెళ్ళి అడిగితే పని జరుగుతుందని శోభనకి ఎవరో చేప్తే తనను అతని దగ్గరికి వెళ్ళి రమ్మని ఎంతకాలంగానో పోరింది. తను ఎందుకు వెళ్ళనని అన్నదో తన జీవితం ఇంత విషాదం ఎవరివలన అయిందో శోభనకి తెలీదు. ఆఖరికి నిన్న రాత్రి నాకు ఉద్యోగంవచ్చి మన సమస్యలు పరిష్కారం అవడం నీకు ఇష్టంలేదు. అందుకే నాగభూషణంగారి దగ్గరికి నువ్వు వెళ్ళవు. నన్ను వెళ్ళనియ్యవు అంది. తన కడుపు చించుకు పుట్టిన శోభన అంతమాట అంటుందని ఊహించలేదు. కానీ పరిస్థితులు కలిగిస్తున్న కడుపుమంట శోభనచేత అలా మాట్లాడించింది. అనుకొని ఆఖరికి ఇవాళ సాయంత్రం నాగభూషణం దగ్గరికి వెళ్ళడానికి నిర్ణయించుకొని ఫోన్‌చేసి బయలుదేరింది.

## (వి) చిత్ర విజ్ఞానం



... the main administrative building of the academy

పూనా నుండి 20 కిలోమీటర్ల దూరంలో వున్న ఖడక్‌వాస్లాలో నేషనల్ డిఫెన్స్ ఎకాడమీ (NDA) వుంది. మన సైనిక దళానికి చెందిన మూడు తెగలకు సంబంధించినవారికి యీ కేంద్రంలో తర్ఫీదు యివ్వబడుతుంది. ప్రతి యేటా జూన్, డిసెంబరు మాసాలలో 250 క్యాడెట్లు యీ కేంద్రం నుండి తర్ఫీదుపొంది మన సైనిక దళంలో చేరుతారు. ఇటువంటి శిక్షణా కేంద్రం ప్రపంచంలో మరెక్కడా లేదు.

---

—అందుకే చాలా కాలం తర్వాత తన జీవితం మళ్ళీ ఆరంభం అయింది.

రత్నావతి తనను ఎంత సమాధాన పరుచుకోవలుచుకొన్నా సాధ్యం కావడంలేదు. ఆడది ఇలా వేటలో తనకి తనుగా వేటగాడి దగ్గరికి వెళ్ళడం తప్పదా? ఆడది జీవితంలో ప్రతిదానికీ తనని అమ్ముకుంటే తప్ప బతకడం సాధ్యం కాదెందుకని?

భూమిమీద మనుగడ ఉన్నంతకాలం ఆడది ఇలా వేటలో జీవం పాత్ర ధరించాల్సిందేనా? నలభై సంవత్సరాలుగా ఏ ఆత్మగౌరవం కోసం పోరాడిందో దాన్ని ఒక్క క్షణంలో పోగొట్టుకోవడంలోని బాధని భరించ శక్యం కాకుండా ఉంది.

రత్నావతి ఇంటి గుమ్మం దగ్గర రిక్షా దిగి వరండాలో కూర్చున్న శోభనతో ఏం మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయింది.

శోభనగూడా తల్లిని ఎక్కడికి వెళ్ళావని అడగలేదు. శోభన ఉదయం పదకొండు గంటలకి ఓ ఫ్రెండ్ దగ్గరికి వెళ్ళింది. రత్నావతి బయలుదేరేదాకా ఇంటికి రాలేదు. అయినా కూతుర్ని ఎప్పుడు వచ్చావ్ అని అడగలేదు.

ఇల్లంతా నిశ్శబ్దం. నిశ్శబ్దంలోనే గంటలు నిమిషాలు సెకండులు వచ్చి వెళ్తున్నాయి. రాత్రి పదకొండు అయింది..

ఇంట్లో ఇద్దరికీ భోజనం మీదకి మనస్సు పోలేదు.

తల్లి బెడ్ రూంలోకి శోభన వెళ్ళి అమ్మా అంది.

'రా శోభనా. .' గదిలో దీపం గూడాలేదు. గొంతే వినిపించింది.

'నీకోమాట చెప్పాలి అమ్మా' రత్నావతి కూతురు వేపు చూసింది.

'నాగభూషణంగార్ని నువ్వింక కలవవని నేనే ఇవాళ వెళ్ళి కలిశా.'

'భగవంతుడి దయవలన ఆయన కలిశారు. నా పని తప్పకుండా చేస్తానన్నారు.'

'ఎన్ని గంటకి వెళ్ళావ్?'

'ఆరు గంటలకి'

'ఎన్ని గంటల్దాకా ఉన్నావ్?'

'ఎనిమిది గంటల దాకా ఉన్నా'

'శోభా!' ఆ పిలుపులో యుగయుగాలుగా మగవాడి వేటలో ప్రాణాలు పోగొట్టుకొన్న జీవాల ఆర్తనాదం అంతా కలిసి ఒక్కసారిగా వినిపించింది. □